క్లుప్తంగా

సాయిబాబాకు విశేష పూజలు



మనుబోలు (పొదలకూరు): మనుబోలు మండలంలోని మనుబోలు, జట్లకొండూరు, మడమనూరు గ్రామాల్లోని సాయిబాబా మందిరాల్లో గురువారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయిబాబా విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. సాయిబాబాను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

గుర్తుతెలియని మహిళ మృతి



వెంకటాచలం: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో సుమారు 55 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తుతెలియని మహిళ మృతి చెంది ఉండడాన్ని రైల్వే సిబ్బంది గురువారం గుర్తించారు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. శరీరంపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చునని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు వాసికి గ్లోబల్ ఫౌండేషన్ అవార్డు



నెల్లూరు సిటీ: నెల్లూరుకు చెందిన ప్రకృతి నివాస్ సేవా ఫౌండేషన్ నిర్వాహకుడు జీవీ గిరీష్‌కుమార్ గ్లోబల్ ఫౌండేషన్ గోల్డెన్ నంది అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లో గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్లోబల్ అవార్డుల ప్రదానోత్సవం-2024 కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేష్ చేతుల మీదుగా గోల్డెన్ నంది అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా గిరీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రకృతి నివాస్ సేవా ఫౌండేషన్ ద్వారా తాను చేపడుతున్న సేవా కార్యక్రమాలను గుర్తించి అవార్డును ప్రదానం చేయడం సంతోషంగా ఉందన్నారు.

దుష్ట శిక్షకుడు..శిష్ట రక్షకుడు బాలకృష్ణుడు

నెల్లూరు(బృందావనం): బాలకృష్ణుడిగా పరమాత్మ దుష్ట శిక్షణ, శిష్ట రక్షణను పిన్నవయస్సు నుంచే చేపట్టి సకల లోకాల శుభాలకు శ్రీకారం చుట్టారని విద్వాన్ అగస్త్యరాజు సుబ్బారావు తెలిపారు. పద్యసారస్వత పరిషత్ నగర శాఖ ఆధ్వర్యంలో బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో 'శ్రీకృష్ణ కథామృతం' భాగవతం సప్తాహంలో భాగంగా రెండోరోజు గురువారం 'బాలకృష్ణుడు' అంశంపై ఉపన్యసించారు. బాల్యంలో పూతన, శకటాసుర, తృణావర్తులను సంహరించడం, మృతభక్షణ, విశ్వరూపం, కాళీయమర్దనం, తదితర అంశాలను వివరించారు. సభాపోషకులుగా పాముల మల్లికార్జునశర్మ, ఓగిరాల శారదాంబ వ్యవహరించారు. పద్యసారస్వత పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు పోలవరపు లక్ష్మీనరసింహారావు, డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. సూరం చంద్రశేఖర్, చక్కిరాల జయప్రసాద్, డాక్టర్ ఎస్సార్కే ప్రసాద్‌రావు, అన్నవరం సత్యనారాయణ, కోట శ్రీరామమూర్తి, తంగిరాల నరసింహకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహావిష్ణు బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి దేవస్థానం ప్రాంగణంలోని మహాలక్ష్మీగోదా సమేత గురువాయూర్ మహావిష్ణువు దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు శాస్త్రోక్తంగా అంకురార్పణ పూజలు నిర్వహించారు. ఉదయం పుణ్యాహవాచనం, అష్టోత్తర శతకలశాభిషేకం, గోపూజ, తదితర పూజా కార్యక్రమాలను నేత్రపర్వంగా నిర్వహించారు. సాయంత్రం విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ, రక్షాసూత్ర ప్రతిష్ట, రక్షాబంధనం, వైనతేయ ప్రతిష్ట, సోమ కుంభ స్థాపన, వాస్తు హోమం, నివేదన, శాత్తుమొరై, తీర్థప్రసాద గోష్టి విశేషంగా నిర్వహించారు. ఆయా పూజా కార్యక్రమాలకు ఉదయం ముప్పవరపు వెంకయ్యానాయుడు, ఉష, డాక్టర్ బీ.నరసింహారెడ్డి, విజయ దంపతులు, సాయంత్రం శ్రీనివాస్, రాధ, శింగంపల్లి నిఖిలేష్ కుమార్, దివ్యభవాని దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. స్వామి అయ్యప్ప సేవా సమాజం అధ్యక్ష,కార్యదర్శులు గూడల శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య, కే మోహన్‌రావు, కేజీ శంకరన్ పర్యవేక్షించారు.

విద్యతోనే ఉజ్వల భవిత

పొదలకూరు: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించాలని ఎంఈఓ కే రేణుక పిలుపునిచ్చారు. మండలంలోని మహమ్మదాపురంలో డీఎస్సార్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో నేను బడికి పోతా కార్యక్రమంపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ సమాజంలో మనగలగాలంటే చదువు అవసరమన్నారు. పిల్లలు చదువుకోవడం వల్ల సమాజాన్ని తెలుసుకోగలుగుతారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయులు రామకృష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొడవలూరు: విద్య ద్వారా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని హెచ్‌ఎం సీహెచ్ శ్రీహరి తెలిపారు. మండలంలోని యల్లాయపాళెం గిరిజన కాలనీలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో 'నేను బడికి పోతా' కార్యక్రమంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ చిన్నారి కూడా డ్రాపౌట్‌గా ఉండరాదన్నారు. విద్యతో కుటుంబం ఎదుగుతుందన్నారు. ఈ విషయాన్ని గుర్తించి తల్లిదండ్రులు తమ పిల్లలను



పొదలకూరు: మహమ్మదాపురంలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంఈఓ రేణుక

బడికి పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఎన్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

- యల్లాయపాళెం అరుంధతీయవాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 'నేను బడికిపోతా' కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం విశ్వేశ్వరరావు మాట్లాడుతూ బడిఈడు పిల్లలంతా విధిగా బడిలోనే ఉండేలా ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఎక్కడైనా బడి బయటి పిల్లలుంటే తమకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని నసరత్ తస్లిమ్, విద్యార్థులు పాల్గొన్నారు.



కొడవలూరు: యల్లాయపాళెం గిరిజన కాలనీలో..



యల్లాయపాళెం అరుంధతీయవాడలో..

అదనపు గదులను వినియోగించుకోండి

పొదలకూరు(మనుబోలు): స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల అవసరానికి మించి అదనపు గదులు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ శేషాద్రివాసు హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన స్టూడెంట్ కిట్లను మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని తరగతి గదుల్లో భద్రపరిచారు. పాఠశాలలు తెరిచి రోజులు గడుస్తున్నా ఇంకా వాటిని పంపిణీ చేయకపోవడంతో విద్యార్థులకు వరండాల్లో, ఆరుబయట బోధన చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయమై 'అధికారుల నిర్లక్ష్యం..విద్యార్థులకు శాపం' శీర్షికన 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి ఎంఈఓ స్పందించారు. గురువారం ఆయన ఉన్నత పాఠశాలను సందర్శించారు. స్టోర్ రూములను తలపిస్తున్న తరగతి గదులను పరిశీలించారు. వరండాల్లో విద్యా బోధనపై విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం హైస్కూల్‌లో ఉన్న విద్యార్థులకు 9 గదులు అవసరం కాగా, 12 గదులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రెండు గదుల్లో మాత్రమే స్టూడెంట్ కిట్లు భద్రపరిచామని తెలిపారు. ఇంకా విద్యార్థులకు పది గదులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెలాఖరుకు స్టూడెంట్ కిట్లు ఉన్న రెండు గదులను కూడా ఖాళీ చేయిస్తామని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న గదుల్లో తరగతులు నిర్వహించాలని హెచ్‌ఎం డేవిడ్, ఉపాధ్యాయులకు సూచించారు.



తరగతి గదిని పరిశీలిస్తున్న ఎంఈఓ

హెలెన్ కెల్లర్‌కు నివాళి

ముత్తుకూరు: అంధులు, బధిరులు, మూగవారికి వారధిగా నిలిచిన చిరస్మరణీయురాలు హెలెన్ కెల్లర్ అని ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి కొనియాడారు. గురువారం ఈదూరు ఈశ్వరమ్మ ఉన్నత పాఠశాలలో అమెరికాకు చెందిన హెలెన్ కెల్లర్ జయంతిని నిర్వహించారు. హెలెన్ కెల్లర్ చిత్రపటానికి ఉపాధ్యాయులతో కలిసి హెచ్‌ఎం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగురాలైన హెలెన్ కెల్లర్ ప్రపంచాన్ని చూడలేకపోయిన తన రచనల ద్వారా ప్రపంచంలోని దివ్యాగుల ఉజ్వల భవితకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. దివ్యాంగులతో పాటు మహిళ హక్కుల కోసం ఎన్నో ఉద్యమాలు సైతం నడిపారని గుర్తుచేశారు.



హెలెన్ కెల్లర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు కిరణ్‌రిషిత

పొదలకూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పొదలకూరు సీహెచ్‌సీ వైద్యురాలు కిరణ్‌రిషిత సూచించారు. పట్టణంలోని విఘ్నేశ్వరకాలనీలో సీజనల్ వ్యాధులపై గురువారం ఆమె అవగాహన కల్పించారు. కాలనీలోని ఇంటింటికి వెళ్లి డయేరియాతో పాటు దోమకాటుతో సంక్రమించే డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నీటిని తాగడం వల్ల డయేరియా వ్యాధి బారిన పడే అవకాశం ఉందన్నారు. కలుషిత నీటిని తాగవద్దని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా వ్యాధులు దరిచేరవన్నారు. దోమ కాటుకు గురికాకుండా దోమతెరలు వాడాలని సూచించారు. అనంతరం పాఠశాల వద్దకు వెళ్లి విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించి ఐరన్ మాత్రలు మింగించారు. ఈ కార్యక్రమంలో వైద్యఆరోగ్య సిబ్బంది రాధాకుమారి, శివప్రసాద్, సుమాంజలి, తదితరులు పాల్గొన్నారు.

అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌తో బహుళ ప్రయోజనాలు

కొడవలూరు: అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌తో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి రామకృష్ణ తెలిపారు. మండలంలోని ఆలూరుపాడులో అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 ఏళ్లు నిండిన వారు విధిగా అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. దీనివల్ల క్షయ రాకుండా ఉండడంతో పాటు బీపీ, షుగర్ అదుపులో ఉంటాయన్నారు. 18 ఏళ్లు నిండిన షుగర్ బాధితులు, గతంలో క్షయ బారినపడి నయం చేసుకున్న వారు కూడా వ్యాక్సిన్ వేయించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ వెంకట్రావు, ఏఎన్‌ఎం నదియ, ఆశ కార్యకర్త పద్మజ పాల్గొన్నారు.



వృద్ధులకు బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న వైద్యసిబ్బంది

బాల్య వివాహాలను అరికట్టాలి



ఇందుకూరుపేట: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ ఇందుకూరు ప్రాజెక్ట్ కార్యాలయంలో మిషన్ వాత్సల్య జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డీసీపీఓ సురేష్, ఏసీడీపీఓ రాజ్యలక్ష్మి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

న్యాయవాదుల మృతికి సంతాపం

నెల్లూరు (లీగల్) : జిల్లా కోర్టు హాల్లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీ యామిని అధ్యక్షతన న్యాయవాదుల మృతికి సంతాప సభను గురువారం నిర్వహించారు. ఇటీవల మృతి చెందిన సీనియర్ న్యాయవాదులు పులి బలరామయ్య , సయ్యద్ షకీల్‌అహ్మద్, కుంచల కృష్ణ, తస్నీరు కోటయ్య, పొన్నలూరు శేషారెడ్డికి సంతాపాన్ని ప్రకటించారు. న్యాయవాదుల జీవిత విశేషాలను రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి , బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, టీ గోపాల్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి వివరించారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుందరయ్యయాదవ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువులు న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

3 వరకు కొండాయపాళెం రైల్వేగేటు మూత

నెల్లూరు(సెంట్రల్): నగరంలోని కొండాయపాళెం రైల్వే గేటును జూలై 3వ తేదీ వరకు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు గురువారం తెలిపారు. గేటు వద్ద రోడ్డు పనులు చేపడుతున్న దృష్ట్యా తాత్కాలికంగా గేటును మూసివేస్తున్నట్లు చెప్పారు. ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు గమనించాలని కోరారు.

సహకార శాఖ సిబ్బందికి శిక్షణ



నెల్లూరు(వీఆర్సీ సెంటర్): నగరంలోని జిల్లా సహకార బ్యాంకు కార్యాలయ సమావేశ మందిరంలో సహకార సిబ్బందికి 'కార్యాలయ నిర్వహణ'పై శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) గుర్రప్ప పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కార్యాలయ నిర్వహణ పద్ధతులు, ఫైళ్ల నిర్వహణ, నోటింగ్, లేఖల డ్రాఫ్టింగ్, ఫైళ్లను ఏవిధంగా పరిష్కరించాలి, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం సహకార శిక్షణా కేంద్రం ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ శ్రీనివాసరావు పలు అంశాలపై అవగాహన కల్పించారు. డీసీసీబీ జనరల్ మేనేజర్ వై సరిత డీసీసీబీ అందిస్తున్న వివిధ రకాల రుణాలు, సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో సహకార విద్యాధికారి గోగుల శ్రీనివాసులు,ససహకారశాఖ సిబ్బంది పా ల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

కొడవలూరు: రైతులు పంటల సాగుకు ముందుగా భూసార పరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ లక్ష్మి సూచించారు. కొడవలూరులోని రైతుల పొలాల్లో భూసార పరీక్షల నిమిత్తం మట్టి నమూనాలను గురువారం సేకరించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ భూసార పరీక్షల ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. భూమి స్వభావం తెలియక పంటలకు మోతాదుకు మించి ఎరువులను ఉపయోగించి రైతులు నష్టపోతున్నారన్నారు. భూసార పరీక్షలను చేయించుకుని ఆధారంగా అవసరమైన మేరకు ఎరువులను వినియోగించుకోవడం ద్వారా ఎరువుల ఖర్చులో యాభై శాతం వరకు తగ్గించుకోవచ్చని తెలిపారు. పంటలకు అవసరమైన ఎరువులను వినియోగించడం వల్ల పంట దిగుబడులు పెరుగుతాయన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి రైతు విధిగా భూసార పరీక్షలు చేయించుకుని అందుకనుగుణంగా ఎరువులను ఉపయోగించుకుని ఎరువుల ఖర్చును ఆదా చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఏఈఓ అనూష, వీఏఏ శివజ్ఞన, రైతులు ఉన్నారు.



మట్టి నమూనాలు సేకరిస్తున్న ఏఓ లక్ష్మి

'విద్యా ప్రవేశం'ను విజయవంతం చేయాలి

- కావలి ఉపవిద్యాశాఖ అధికారి రఘురామయ్య

కొడవలూరు: 'విద్యా ప్రవేశం' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు హెచ్‌ఎంలు కృషి చేయాలని కావలి ఉపవిద్యాశాఖ అధికారి రఘురామయ్య కోరారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు 'విద్యా ప్రవేశం'పై శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కొడవలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపవిద్యాశాఖ అధికారి పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల హాజరును పెంచడమే లక్ష్యంగా విద్యాశాఖ ఈ నెల 28 నుంచి జూలై 25 వరకు విద్యా ప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా హెచ్‌ఎంలు లక్ష్యాలు నిర్దేశించుకుని ప్రతి పాఠశాలలో పిల్లల హాజరు పెంపునకు కృషి చేయాలన్నారు. బడిఈడు పిల్లలంతా ప్రభుత్వ పాఠశాలల్లో ఉండేలా చూడాల్సిన బాధ్యత హెచ్‌ఎంలదేనన్నారు. ఎంఈఓ వసంతకుమారి మాట్లాడుతూ ప్రతి హెచ్‌ఎం కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుని అమలు చేయాలని, అమలు చేసిన అంశాలను దీక్ష యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా హెచ్‌ఎం తాటిపర్తి వెంకటేశ్వర్లు వ్యవహరించారు. హెచ్‌ఎంలు మోహనరామలింగయ్య, శ్రీనివాసరావు, ఎంఐఎస్ సమన్వయకర్త డీ స్వర్ణలత, సీఆర్‌ఎంటీలు ఎం దయాకర్, పెంచలరావు తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌ఎంలకు సూచనలు ఇస్తున్న ఉపవిద్యాశాఖ అధికారి రఘురామయ్య

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

పొదలకూరు(మనుబోలు): రోడ్డు ప్రమాదంలో గీత కార్మికుడు తీవ్రంగా గాయపడిన ఘటన మనుబోలు బైపాస్‌లోని యాచవరం క్రాస్‌రోడ్డు వద్ద గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు..చేజర్ల మండలం చిత్తలూరు గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాళ్ల శ్రీనివాసులు మనుబోలు పంచాయతీ పరిధిలోని యాచవరంలో ఉన్న బంధువుల ఇంటికి వచ్చారు. యాచవరం క్రాస్‌రోడ్డు వద్ద హైవే దాటుతుండగా నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళుతున్న ట్రాలీ ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహన సిబ్బంది నెల్లూరుకు తరలించారు. మనుబోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులు

రక్తదానంతో ప్రాణదానం

పొదలకూరు(మనుబోలు): మనుబోలు మండలం కొమ్మలపూడి గ్రామ సర్పంచ్ బందెల వేణుగోపాల్ జన్మదినాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో 20 మంది యువత గురువారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన వ్యక్తి ఏడాదికి కనీసం మూడు సార్లు రక్తదానం చేయవచ్చన్నారు. ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయాలని కోరారు. అనంతరం తన జన్మదినం సందర్భంగా స్వచ్ఛందంగా రక్తదానం చేసిన యువతను అభినందించారు. అనంతరం వేణుగోపాల్, కొమ్మలపూడి యువతను రెడ్‌క్రాస్ కన్వీనర్ అజయ్‌బాబు, వైద్యులు అభినందించారు.



వేణుగోపాల్‌ను అభినందిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

మట్టి నమూనాల సేకరణలో జాగ్రత్తలు పాటించాలి

వెంకటాచలం(తోటపల్లిగూడూరు): భూసార పరీక్షలకు మట్టి నమూనాలను సేకరించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ సూచించారు. మండలంలోని పాపిరెడ్డిపాళెంలో భూసార పరీక్షలకు రైతులకు వ్యవసాయాధికారులు గురువారం అవగాహన కల్పించారు. అనంతరం మట్టి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఏడీఏ రాజ్‌కుమార్ మాట్లాడుతూ భూసార పరీక్షలకు మట్టి నమూనాల సేకరణ ఎంతో కీలకమన్నారు. చెట్ల కింద, బోర్ల సమీపంలో, ఎరువు దిబ్బలు ఉన్న చోట మట్టి నమూనాలను సేకరించకూడదన్నారు. చౌడుభూములు, క్షార భూముల్లో మాత్రమే మట్టి నమూనాలను సేకరించాలన్నారు. ఎకరా పొలంలో పది చోట్ల వీ ఆకారంలో గుంతలు తీసి అర కేజీ చొప్పున ఐదు కేజీల మట్టిని సేకరించాలన్నారు. అలా సేకరించిన మట్టిని పాలిథిన్ కవర్‌పై పోసి మొత్తం కలిపి మళ్లీ అర కేజీ చొప్పున కవర్లలో కట్టి పరీక్షలకు పంపాలని సూచించారు. భూసార పరీక్ష ఫలితాలకు అనుగుణంగా పంటలకు ఎరువులు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ శిరీషారాణి, వీఏఏలు షర్మిల, పలువురు రైతులు పాల్గొన్నారు.



టీపీగూడూరు: మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

వెంగమాంబ తిరునాళ్లకు వెళ్లొచ్చేలోగా..



చోరీ ఘటనపై వివరాలు సేకరిస్తున్న పోలీసులు

- ఉపాధ్యాయుడి ఇంట్లో భారీ చోరీ
- 39 సవర్ల బంగారం, రూ.3 లక్షల నగదు అపహరణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఉపాధ్యాయుడి ఇంట్లో దొంగలు చొరబడి భారీగా బంగారం, నగదు అపహరించుకెళ్లిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. బాధితుడు, పోలీసుల వివరాల మేరకు.. నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పత్తిపాటి వెంకటేశ్వర్లు లైలా థియేటర్ సమీపంలో నివాసం ఉంటున్నారు. బుధవారం ఉదయం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి నర్రవాడ వెంగమాంబ పేరంటాళ్ల తిరునాళ్లకు వెళ్లారు. గురువారం మధ్యాహ్నం 3:30గంటలకు ఇంటికి చేరుకున్నారు. ఇంటి మెయిన్ డోర్, బీరువా తెరిచి ఉండడం గమనించారు. బీరువాను పరిశీలించగా అందులోని రూ.3 లక్షల నగదు, 39 సవర్ల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో బుచ్చిరెడ్డిపాళెం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీంతో వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హైమారావు తెలిపారు.